నేడు అన్ని రంగాల్లో మహిళలదే పైచేయి

–జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు మొక్క బహూకరిస్తున్న ఉద్యోగినులు

గుంటూరు ఎడ్యుకేషన్: నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం నగరంపాలెంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగినులకు ఆటల పోటీల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్ని హెనీ క్రిస్టినా మాట్లాడుతూ దైనందిన జీవితంలో, విధి నిర్వహణలో నిరంతరం తీరిక లేకుండా గడుపుతున్న ఉద్యోగినుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఆటల పోటీల్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా ఉద్యోగినులతో కలసి టెన్నికాయిట్ ఆడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, జెడ్పీ సీఈఓ జె. మోహనరావు సతీమణి సోనియా, కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం, తెనాలి జెడ్పీటీసీ సభ్యురాల పిల్లి ఉమా ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా జగన్ పాలన

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: అవినీతి, వివక్షకు తావులేని సంక్షేమాభివృద్ధి పాలనకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిరునామాగా నిలిచారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు అన్నారు. సోమవారం 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి నేతృత్వంలో కేవీపీ కాలనీ రోడ్డులోని జోసఫ్‌నగర్ కమ్యూనిటీ హాలు నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రమూ కనీసం ఊహించని విధంగా మన రాష్ట్రంలో సామాజిక మహా విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యంత పారదర్శకంగా, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విప్లవాత్మక చర్యలతో ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక ప్రభుత్వం ఇదేనని వివరించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో మరింత వేగంగా, నిరవధికంగా అమలు చేసే విధంగా సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండలు, సుందరరావు, చక్రి, బాలిరెడ్డి, ఉపేంద్ర, కాసిరెడ్డి, రాఘవమ్మ, మామిడి వెంకటేశ్వర్లు, హరిహరరావు, జ్యోతి, ఝాన్సీ, సౌజన్య, 25వ డివిజన్ పరిధిలోని ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాగా చదువుకోవాలని విద్యార్థినికి చెబుతున్న ఎమ్మెల్యే మద్దాళి

కుటుంబ వ్యవస్థను మహిళలే కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాసవీ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ గిరిజా శాంతకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందని వాసవీ క్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ టి. గిరిజా శాంతకుమారి పేర్కొన్నారు. సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో సోమవారం వాసవీ క్లబ్ మహిళా శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, హక్కులతో పాటు బాధ్యతల్ని కూడా గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల్ని సత్కరించారు. మహిళలకు వివిధ పోటీల్ని నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలమయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు మాజేటి మణికంఠ, స్వాతి, కార్యదర్శి పి. శ్రీనివాసరావు, పి. మంజుల, కోశాధికారి పి. నాగరాజు, భవాని, జె. శ్రీనివాసరావు, జె. శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల కల్తీపై విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆహార పదార్థాలు, శీతల పానీయాల్లో కల్తీపై టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ నిత్యం మనం ఉపయోగించే ప్రతి వస్తువుకు మార్కెట్‌లో నకిలీ తయారు చేయబడుతోందని, వాటిని గుర్తించే విధానాల్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ యస్.అనితాదేవి, పాఠశాల కరస్పాండంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, టీజేపీఎస్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐలో ఉద్యోగాలకు 31 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు సీనియర్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 31 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మూడంచెల విధానంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన 65 మందిలో రాత పరీక్ష, బృంద చర్చలు, ముఖాముఖీ అనంతరం బ్యాంకు ప్రతినిధులు 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక విధానాన్ని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి చల్లా వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయ ఆచార్యులు కల్యాణి, వేదవతి, పద్మావతి, అనిత, డాక్టర్ అశోక్‌బాబు, ఎ. బాజీబాబు, ఎస్. మణికంఠ, వి.అభిలాష్ పర్యవేక్షించారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యార్థులు భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, ప్రొబెటిక్స్, త్రీడీ ప్రింటింగ్ వంటి సాంకేతిక నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని మొహాలీలోని జాతీయ ఫార్మసీ విద్య పరిశోధన సంస్థ (నైపర్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ. రఘురామ్‌రావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం భారత ఫార్మసీ విద్య పితామహుడు ప్రొఫెసర్ మహదేవలాల్ ష్రాఫ్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ రఘురామ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్య వ్యాప్తికి మహదేవలాల్ ష్రాఫ్ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులకు భారత ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జీవితకాల సభ్యత్వ పత్రాల్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో కళాశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాల్ని చవి చూసేవారు. చేసేది లేక ఇళ్లల్లో, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అక్కడ దాచిన పంట కీటకాలు, ఇతరత్రా మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అనేక అవస్థల్ని ఎదుర్కొనే వారు. క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. చేలో పంట ఏవిధంగా ఉందో.. నెలలు గడిచినా, అమ్మే వరకు శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజీ) భద్రంగా దాచేందుకు సిద్ధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 82 శీతల గిడ్డంగులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

నాణ్యమైన సౌకర్యాలు

శీతల గిడ్డంగుల్లో గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని రైతులు సరుకు భద్రపరుచుకునేందుకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగుల్ని ఆశ్రయిస్తుంటారు. వారి రాకతో గిడ్డంగులు నిండుకుండలా మారుతున్నాయి. చాలా గిడ్డంగుల్లో యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. ఈ సౌకర్యం రైతులకు లాభదాయకంగా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహిస్తుండటంతో పంట చెక్కు చెదరడం లేదు.

తక్కువ ధరలకే నిల్వ సౌకర్యం

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాల్ని పాటిస్తున్నాం.

–తడకమళ్ల సూర్యప్రకాశరావు,
ది కోల్డ్‌స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

నేడు ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్‌కు శంకుస్థాపన

లక్ష్మీపురం: ముస్లింలను రాజకీయంగా బలోపేతం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు మాత్రమే దక్కుతుందని జిల్లా జమైతుల్ ఉలెమా అధ్యక్షుడు రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ బాసిత్ స్పష్టం చేశారు. పట్టాభిపురంలోని షాదీఖానాలో సోమవారం షాదీఖానా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా వెనుక వైపు ఉన్న మున్సిపల్ స్థలంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్ శంకుస్థాపన మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షాదీఖానా కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ రోషన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.





